అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..





ధర్మసాగర్.. చరిత్ర, సంస్కృతి, జలవైభవానికి చిరునామా


WANTED

రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త

దిన పత్రికలో పని చేయుటకు తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను

జర్నలిస్ట్ వార్త JV NEWS

ఎడిటర్: బిర్రు కరుణాకర్ Cell:9701249103



సంపుటి - 3 సంచిక -23 శనివారం 20 జూన్ 2026 ఎడిటర్ : బిర్రు కరుణాకర్ పేజీలు -5 వెల - 5/- 01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## ట్రంప్ మాట బేఖాతరు..

# లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

వైమానిక దాడుల్లో దాదాపు 16 మంది మృతి

ఇటీవలే అమెరికా-ఇరాన్ మధ్య ఒప్పందం

ఒప్పందం ప్రకారం లెబనాన్‌పైనా సైనిక చర్యలు ఆపాలి

అమెరికా హెచ్చరికలను బేఖాతరు చేసిన నెతన్యాహు

తాజా ఘర్షణలతో శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం

**జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఇరాన్–అమెరికా మధ్య తాజాగా కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన గంటల్లోనే మళ్లీ ఉద్రిక్తతలు మొదలయ్యాయి. లెబనాన్ దక్షిణ ప్రాంతాలపై ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో కనీసం 16 మంది మరణించినట్లు అక్కడి ప్రభుత్వ వార్తా **మిగతా 2లో...**



# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

రూ.3,125 కోట్లు పంపిణీకి రంగం సిద్ధం

46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ది

లింగంగుట్లలో అందచేయనున్న సిఎం చంద్రబాబు

**అమరావతి,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలోని రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు అన్నదాత సుఖీభవ నిధులను ఏపి ప్రభుత్వం నేడు విడుదల చేయనుంది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గంలోని లింగం గుంట్లలో జరిగే కార్యక్రమంలో ఈ నిధులను సీఎం చంద్రబాబు నాయుడు విడుదల చేయనున్నారు. 2026–27 ఆర్థిక సంవత్సరంలో తొలి విడత నగదును అన్నదాతల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ ద్వారా ఈ ఏడాది తొలి విడతగా రూ.3,125 కోట్లు **మిగతా 2లో...**






# జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన...

తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు

జూన్ 25 నుంచి ఇంటింటికి వచ్చి వివరాల సేకరణ

సుమారు 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు

సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

ఎల్బీ స్టేడియం కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి




నాణ్యమైన విద్యతో పాటు వసతి సౌకర్యాలు

తెలంగాణలో విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి

విద్యార్థులకు యంగ్ ఇండియా స్కూల్ కిట్స్ అందచేత

విద్యామంత్రిగా తానే నిరంతర పర్యవేక్షణ

**హైదరాబాద్,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
దేశ బవిష్యత్ పాఠశాలల్లోనే ఉందని గ్రహించి, అందుకు అనుగుణంగా తెలంగాణ విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. కార్పోరేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చి దిద్దుతున్నామని అన్నారు. పేదలు ఆత్మన్యూన తకు లోనుకకాకుండా వారి పిల్లలకు కూడా ప్రైవేట్ తరహా విద్యను

# వార్షిక రుణ ప్రణాళిక రూ.8.10 లక్షల కోట్లు

బ్యాంకర్ల కమిటీ సమావేశంలో రుణాలపై చర్చ

రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడి

సిఎం చంద్రబాబు అధ్యక్షతన బ్యాంకర్ల కమిటీ భేటీ




**అమరావతి,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం జరిగింది. ఏపీ సచివాలయంలోని 5వ బ్లాక్‌లో శుక్రవారం మధ్యాహ్నం 235వ బ్యాంకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ భేటీలో 2026–27 వార్షిక రుణ ప్రణాళికపై బ్యాంకర్లతో సీఎం చంద్రబాబు చర్చించారు. వ్యవసాయ రంగం, ఎంఎస్ఎంఈలు, స్వయం సహాయ సంఘాలు, కౌలు రైతులకు అందించిన రుణాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2025–26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగానికి రూ.3,86,249కోట్ల రుణాలు మంజూరు చేసినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు బ్యాంకర్లు వివరించారు. ఎంఎస్ఎంఈ రంగానికి రూ.1,17,357కోట్లు, ప్రాధాన్య రంగానికి రూ.5,19,693కోట్ల రుణాలు అందించినట్లు వెల్లడించారు. దక్షిణ భారతదేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో రుణాల పంపిణీ 137 శాతం మేర ఉన్నట్లు సీఎం చంద్రబాబుకు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంకర్లకు**మిగతా 2లో...**

# ఏపీలో రెండు విషాదాంతాలు..

కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి




ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య

శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం



# మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

ధన్యవాదాలు తెలిపిన రేవంత్ రెడ్డి

రక్షణ శాఖ భూములు వినియోగించుకునేందుకు కేంద్రం అనుమతి

83.81 ఎకరాల డిఫెన్స్ భూమి వినియోగించుకోవడానికి క్లియరెన్స్ ఇచ్చిన కేంద్రం

**హైదరాబాద్,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ రివర్‌ఫ్రంట్ అభివృద్ధి, పునరుజ్జీవన ప్రాజెక్టులో ఒక కీలక ముందడుగు పడింది. హైదరాబాద్‌లోని బాపూఘాట్‌ను 'గాంధీ సరోవర్' ప్రాజెక్టుగా అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేసేందుకు కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ అధికారికంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే రక్షణ శాఖ భూములను వినియోగించుకునేందుకు వీలుగా కేంద్రం పని అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. **మిగతా 2లో...**

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం

మణికొండ మల్కం చెరువు సమీపంలో కొత్త ఆఫీస్

జెండా ఎగురేసి ప్రారంభించిన జనసేనాని పవన్ కళ్యాణ్



**హైదరాబాద్,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ప్రారంభం అయ్యింది. పార్టీ అధినేత, ఎపి డిప్యూటి సిఎం÷– పవన్ కళ్యాణ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మణికొండ మల్కం చెరువు సమీపంలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కార్యాలయం శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయ ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ జనసేన జెండాను ఆవిష్కరించి కార్యాలయంలోకి అడుగుపెట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం తెలంగాణ తల్లి చిత్రపటానికి నమస్కరించి, రాష్ట్ర నాయకులతో ముచ్చటించారు**మిగతా 2లో...**

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

మాఫియా నాయకుడిగా రేవంత్ వ్యవహార శైలి

కెసిఆర్‌ను తిట్టడమే పనిగా పాలన సాగిస్తున్నారు

మల్కాజిగిరి కార్యకర్తల సమావేశంలో కెటిఆర్ విమర్శలు



# మూసీ రివర్ ఫ్రంట్ కు కేంద్రం అనుమతి..

**మొదటిపేజీ తరువాయి**

ఈ అనుమతుల ప్రకారం... ఆర్టిలరీ సెంటర్ గోల్కొండ పరిధిలోని సుమారు రూ. 533.42 కోట్ల విలువైన 83.81 ఎకరాల రక్షణ శాఖ భూమిని గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ అభివృద్ధి పనుల కోసం వినియోగించుకోవడానికి కేంద్రం క్లియరెన్స్ ఇచ్చింది. లీగల్, డిఫెన్స్ నిబంధనల ప్రకారం ఇరు ప్రభుత్వాల మధ్య జరిగిన సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఈ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్ ప్రక్రియకు కేంద్ర రక్షణ శాఖ తుది ఆమోదం తెలిపింది. దీంతో బాపూఘాట్ పరిసరాల్లో ప్రతిపాదిత అంతర్జాతీయ స్థాయి స్మారక చిహ్నాలు, పర్యాటక హంగుల నిర్మాణానికి ఉన్న ప్రధాన లీగల్ అడ్డంకులు తొలగిపోయాయి.

మూసీ రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి అనుమతులు లభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. "మూసీ పునరుజ్జీవం, రివర్ ఫ్రంట్ అభివృద్ధికి సంబంధించి మా ప్రభుత్వం పెట్టుకున్న సుదూర లక్ష్యాలు సాధించడంలో ఇదో చారిత్రాత్మక మైలురాయి. మూసీ పరివాహక ప్రాంతాన్ని కేవలం కాంక్రీట్ కట్టడాలుగా కాకుండా.. పర్యావరణ, సాంస్కృతిక, అద్భుతమైన ప్రజా ఆస్తిగా మార్చడమే మా ప్రభుత్వ ప్రధాన సంకల్పం" అని సీఎం స్పష్టం చేశారు. కేంద్రం ఇచ్చిన క్లియరెన్స్‌తో మూసీ ఫేజ్-1 పనులు మరింత వేగవంతం కానున్నాయి.

# ట్రంప్ మాట బేఖాతరు.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు

**మొదటిపేజీ తరువాయి**

సంస్థ వెల్లడించింది. దీంతో పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ ఆందోళనకరంగా మారింది. దక్షిణ లెబనాన్‌లోని పలు ప్రాంతాలపై గురువారం రాత్రి నుంచి దాడులు కొనసాగుతున్నట్లు ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. మరోవైపు హెజ్బొల్లా కూడా ఆ ప్రాంతంలో తీవ్ర ఘర్షణ జరుగుతోందని తెలిపింది. ఈ పరిణామం ఇరాన్-అమెరికా మధ్య కుదిరిన తాజా ఒప్పందానికి సవాల్‌గా మారింది. ఆ ఒప్పందం ప్రకారం లెబనాన్‌తో సహా అన్ని ప్రాంతాల్లో సైనిక చర్యలు వెంటనే నిలిపివేయాలి. అలాగే లెబనాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవించాల్సి ఉంటుంది. అయితే ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మాత్రం వెనక్కి తగ్గేది లేదనే సంకేతాలు ఇచ్చారు. హెజ్బోల్‌ంలా నుంచి ముప్పు పూర్తిగా తొలగే వరకు లెబనాన్‌లో సైనిక చర్యలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. మరోవైపు ఇరాన్-అమెరికా ప్రతినిధుల మధ్య స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన తదుపరి చర్చలు కూడా వాయిదా పడ్డాయి. శాశ్వత శాంతి ఒప్పందంపై చర్చించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారు. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ. వాన్స్.. స్విట్జర్లాండ్ పర్యటనను వాయిదా వేసుకున్నారు. అధికారికంగా సాంకేతిక కారణాలే కారణమని వైట్‌హౌస్ తెలిపింది. కానీ, లెబనాన్‌లో ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతుండటంతో ఇరాన్ తన ప్రతినిధి బృందాన్ని పంపడంలో జాప్యం చేస్తోందన్న వార్తలు వెలువడ్డాయి. ఇటీవలే అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియన్ అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గుతాయన్న ఆశలు వ్యక్తమయ్యాయి. కానీ లెబనాన్‌లో తాజా దాడులతో ఆ ఆశలపై నీళ్లు చల్లినట్లైంది. ఒప్పందం తర్వాత మాట్లాడిన వాన్స్.. ఇజ్రాయెల్‌కు పరోక్ష హెచ్చరిక కూడా చేశారు. ప్రస్తుతం ప్రపంచంలో ఇజ్రాయెల్ పట్ల అత్యంత సానుకూలంగా వ్యవహరిస్తున్న నాయకుడు ట్రంప్ మాత్రమేనని వ్యాఖ్యానించారు.

ఇప్పటికే యుద్ధంతో అల్లకల్లోలంగా మారిన పశ్చిమాసియాలో పరిస్థితులు ఏ దిశగా వెళ్తాయన్న దానిపై ప్రపంచ దేశాలు నిశితంగా గమనిస్తున్నాయి. లెబనాన్‌లో హింస ఆగకపోతే ఇరాన్-అమెరికా శాంతి ప్రయత్నాలకు గండిపడే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# జూన్ 25 నుంచి ఇంటింటి సర్వే

**తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళన...**

**తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సన్నాహాలు**

**జూన్ 25 నుంచి ఇంటింటికి వచ్చి వివరాల సేకరణ**

**సుమారు 25 ఏళ్ల తర్వాత జరుగుతున్న అతిపెద్ద కసరత్తు**

**సన్నద్ధతపై అధికారులతో సీఈఓ సుదర్శన్ రెడ్డి సమీక్ష**

**హైదరాబాద్,జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రక్షాళనకు ఎన్నికల సంఘం సన్నద్ధమైంది. సుమారు 25 ఏళ్ల తర్వాత రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహిస్తున్న 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) - 2026' కార్యక్రమాన్ని జూన్ 25 నుంచి చేపట్టనున్నారు. ఈ కార్యక్రమ సన్నద్ధతపై రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి గురువారం అధికారులతో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారులు (డీఈఓలు), ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్ఓలు), అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డితో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాన్ని అత్యంత పారదర్శకంగా, కచ్చితత్వంతో నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు), ఏజెంట్లతో సమన్వయం చేసుకుంటూ, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు.

ఈ ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించి, వాటిని ధృవీకరిస్తారు. నకిలీ, మరణించిన మరియు చిరునామా మారిన ఓటర్లను జాబితా నుంచి తొలగించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా 35,000 మందికి పైగా బీఎల్ఓలు, దాదాపు 26,000 మంది బూత్ లెవల్ ఏజెంట్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించనున్నారు. 2026 అక్టోబర్ 1వ తేదీని అర్హత తేదీగా ప్రామాణికంగా తీసుకుని తుది ఓటరు జాబితాను ప్రచురిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సుమారు 3.39 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఈ సర్వేలో సమగ్రంగా పరిశీలించనున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని తమ ఓటు వివరాలను సరిచూసుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ఏపీలో రెండు విషాదాంతాలు..

# కుటుంబ కలహాలతో ఏడుగురి మృతి

**ప్రకాశం జిల్లాలో ముగ్గురు కూతుళ్లకు విషమిచ్చి చంపి, తండ్రి ఆత్మహత్య**

**శ్రీకాకుళంలో ఇద్దరు పిల్లలతో కలిసి రైలు కిందపడి తల్లి బలవన్మరణం**

**జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** ఏపీలో రెండు వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన హృదయ విదారక ఘటనలు తీవ్ర విషాదాన్ని నింపాయి. కుటుంబ కలహాల కారణంగా రెండు కుటుంబాలకు చెందిన ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఐదుగురు పసిపిల్లలు ఉండటం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో ఈ దారుణాలు చోటుచేసుకున్నాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రెండు ఘటనల వెనుక కుటుంబ సమస్యలే ప్రధాన కారణంగా ఉన్నాయి.

**ప్రకాశం జిల్లాలో తండ్రి ఘాతుకం**

ప్రకాశం జిల్లా చిమకుర్తి మండలం అగ్రహారం గ్రామంలో ఓ తండ్రి రాక్షసుడిగా మారాడు. భార్య కాపురానికి రావడం లేదన్న కోపంతో కన్నబిడ్డలనే కడతేర్చాడు. ఏకుల సుధాకర్ (35) అనే వ్యక్తి తన ముగ్గురు కుమార్తెలు గో అచ్యుత (13), పూజిత (11), లోకిత (8)లకు ఆహారంలో విషం కలిపి తినిపించాడు. వారు ముగ్గురూ మరణించారని నిర్ధారించుకున్న తర్వాత గ్రామ శివార్లలోని పొలానికి వెళ్లి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో సుధాకర్ తీవ్ర మనస్తాపానికి గురయ్యాడని, ఈ క్రమంలోనే ఈ దారుణానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, నాలుగు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.ఐ

**శ్రీకాకుళంలో పిల్లలతో తల్లి ఆత్మహత్య**

ఇలాంటిదే మరో విషాద ఘటన శ్రీకాకుళం జిల్లాలో చోటుచేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పసిపిల్లలతో సహా రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. పలాస-తలభద్ర రైల్వే స్టేషన్ల మధ్య ట్రాక్‌పై మూడు మృతదేహాలను గుర్తించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. మృతులను పూజ (28), ఆమె కుమారుడు కుశాంత్ (5), కుమార్తె దీక్షిత (3)గా గుర్తించారు. శ్రీకాకుళం జిల్లా భావనపాడుకు చెందిన పూజకు ఎనిమిదేళ్ల క్రితం అదే జిల్లా చలమయ్యపేటకు చెందిన వెంకటయ్యతో వివాహమైంది. విజయవాడలో నివాసముంటున్న ఈ కుటుంబం, వేసవి సెలవుల కోసం ఇటీవలే చలమయ్యపేటకు వచ్చింది. భర్తతో విభేదాల కారణంగా నిన్న ఉదయం పిల్లలతో కలిసి ఇంట్లోంచి వెళ్లిపోయిన పూజ, రాత్రంతా పలాస రైల్వే స్టేషన్‌లో గడిపినట్లు తెలిసింది. ఆ తర్వాత ఈరోజు ఉదయం పిల్లలిద్దరినీ గట్టిగా పట్టుకుని, వేగంగా వస్తున్న రైలు కింద దూకి ప్రాణాలు తీసుకుంది. తన కుమార్తె మృతికి అత్తింటి వేధింపులే కారణమని పూజ తల్లి ఆరోపిస్తున్నారు. రైల్వే పోలీసులు మృతదేహాలను సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఒకే రోజు రెండు వేర్వేరు జిల్లాల్లో జరిగిన ఈ ఘటనలతో ఏడుగురు ప్రాణాలు కోల్పోవడం, అందులో ఐదుగురు చిన్నారులు ఉండటం తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది.

# నేడు అన్నదాత సుఖీభవ నిధుల విడుదల

**మొదటిపేజీ తరువాయి**

పంపిణీ చేయనున్నారు. ఈ నగదు ద్వారా 46.85 లక్షల మంది రైతు కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. మరో వైపు శనివారం ప్రధాన మంత్రి కిసాన్ యోజన పథకం కింద నిధులను విడుదల చేస్తోంది. పశ్చిమ బెంగాల్ హుగ్లీ జిల్లాలోని తారకేశ్వర్‌లో జరిగే కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేయనున్నారు. దీంతో ఒక్కో రైతు ఖాతాలో రూ. 2 వేలు చొప్పున నగదు జమ కానుంది. దీంతో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఒకే రోజు రైతుల ఖాతాల్లో నగదు జమ చేయనున్నాయి.

ఇంకో వైపు జూన్ 30వ తేదీన రాష్ట్రంలోని రైతులకు రైతు భరోసా నిధులు విడుదల చేయాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ రోజు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మధిరలో నిర్వహించే సభలో సీఎం రేవంత్ రెడ్డి ఈ నిధులను విడుదల చేయనున్నారు.

# హైదరాబాద్‌లో జనసేన కార్యాలయం



**మొదటిపేజీ తరువాయి** రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జనసేన పార్టీ బరిలోకి దిగుతుందని పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇప్పటికే స్పష్టం చేశారు. ఒంటరిగానైనా సరే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీకి బలం పెంచేందుకు త్వరలోనే తానే స్వయంగా తెలంగాణవ్యాప్తంగా పర్యటిస్తానని ఆయన ప్రకటించారు. ఈ క్రమంలోనే గ్రేటర్ ఎన్నికలను ఒక సవాల్‌గా తీసుకుని క్యాడర్‌ను సమాయత్తం చేసేందుకు ఈ నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా మారిన జనసేన పార్టీ.. తెలంగాణపై తన రాజకీయ దృష్టిని కేంద్రీకరించింది. రాష్ట్రంలో పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా సరికొత్త వ్యూహాలతో దూకుడు పెంచింది. హైదరాబాద్‌లో ఇప్పటికే జనసేన పార్టీకి కార్యాలయం ఉన్నప్పటికీ.. తెలంగాణలో పార్టీ ఉనికిని మరింత బలంగా చాటేందుకు ఈ కొత్త ఆఫీస్‌ను అందుబాటులోకి తెచ్చారు. రాష్ట్రంలో పార్టీ చేరికలను ప్రోత్సహించేందుకు వీలుగా త్వరలోనే ఒక ప్రత్యేక 'జాయినింగ్స్ కమిటీ'ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యాలయం కేంద్రంగానే తెలంగాణలో సంస్థాగత నిర్మాణం, కమిటీల ఏర్పాటు, ఇతర రాజకీయ వ్యూహాలపై జనసేన నాయకత్వం దృష్టి సారించనుంది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఢిల్లీ వేదికగా జరిగిన 'సేన ప్రస్థానం' కార్యక్రమంలో తెలంగాణ రాజకీయాల గురించి ప్రస్తావించడం, అలాగే హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస పరిణామాలు జనసైనికుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. ఆంధ్రప్రదేశ్‌లో సాధించిన విజయ ఉత్సాహంతో తెలంగాణలోనూ జనసేనను ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా నిలబెట్టాలని పవన్ భావిస్తున్నారు. ఈ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంతో తెలంగాణ రాజకీయాల్లో జనసేన తన తదుపరి పొలిటికల్ రోడ్ మ్యాప్‌ను ఎలా సిద్ధం చేసుకోబోతోందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వార్షిక రుణ ప్రణాళిక రూ.8.10 లక్షల కోట్లు

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి పలు కీలక సూచనలు చేశారు. మరోవైపు రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలు మరింత విస్తరించేలా సహకారం అందించాలని కోరారు. కాగా, ఎస్ఎల్‌బీసీ సమావేశానికి సీఎస్ సాయి ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఆశిష్ పాండే, కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ డైరెక్టర్ నీలమ్ అగర్వాల్, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ ఏవో బషీర్, నాబార్డ్ జీఎం కేవీఎస్ ప్రసాద్, తదితరులు హాజరయ్యారు.

# గోపి నగర్ బోర్డులపై
# కొనసాగుతున్న వివాదం

**స్నేహ కాలనీలోని బోర్డు తొలగించిన స్థానికులు**

**ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కనున్న బోర్డుపై పంచాయతీ చర్యల కోసం ఎదురుచూపులు**

**ఫిర్యాదులు చేసినా స్పందించని అధికారులపై విమర్శలు**






**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో జూన్ 19 (జర్నలిస్ట్ వార్త)**హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని స్నేహనగర్‌లో "గోపి నగర్" పేరుతో ఏర్పాటు చేసిన రెండు బోర్డులు గ్రామంలో వివాదానికి కేంద్రబిందువుగా మారాయి. గ్రామపంచాయతీ అనుమతులు లేకుండానే కొందరు వ్యక్తులు బోర్డులు ఏర్పాటు చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక బోర్డు స్నేహ కాలనీలో, మరొకటి ఎస్సీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ గోడ పక్కన ఏర్పాటు చేసినట్లు చేశారుఈ విషయమై గ్రామ సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్‌కు గ్రామస్తులు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. దీంతో శుక్రవారం స్నేహ కాలనీ ప్రజలే ముందుకొచ్చి తమ కాలనీలో ఏర్పాటు చేసిన గోపి నగర్ బోర్డును తొలగించారు. అయితే ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కన ఏర్పాటు చేసిన మరో బోర్డు ఇప్పటికీ అలాగే ఉండటంపై గ్రామంలో చర్చ జరుగుతోంది. స్నేహ కాలనీలోని బోర్డును ప్రజలు తొలగించిన నేపథ్యంలో, ఎస్సీ కమ్యూనిటీ హాల్ పక్కనున్న బోర్డును గ్రామపంచాయతీ పాలకవర్గం, అధికారులు ఎప్పుడు తొలగిస్తారనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్డుపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు నిలదీస్తున్నారు.

**మౌనం వెనుక కారణాలేమిటి..?**

ఫిర్యాదులు అందినా అధికారులు స్పందించకపోవడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్డుల విషయంలో పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ధర్మసాగర్ చరిత్రను కాపాడాలని డిమాండ్** చారిత్రక ప్రాధాన్యం కలిగిన ధర్మసాగర్ గ్రామంలో ఎవరికి వారుగా కొత్త పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయడం సరికాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గ్రామ చరిత్ర, గుర్తింపును దెబ్బతీసే చర్యలను అరికట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన బోర్డులపై వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వివాదానికి తెరదించాలని కోరుతున్నారు.

# ఎన్నికల హామీలను విస్మరించిన కాంగ్రెస్

**హైదరాబాద్,జూన్ 19:**ంవంత్ రెడ్డి అబద్ధాలు చెప్పి, మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. మల్కాజ్‌గిరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది రోజుల్లోనే ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రస్తావిస్తూ, ప్రభుత్వాన్ని ఒక మాఫియాతో పోల్చారు. ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులవుతున్నా ఇచ్చిన గ్యారంటీల ఊసే లేదు. దీనిపై ముఖ్యమంత్రిని ప్రశ్నిస్తే అడ్డమైన తిట్లు తిడుతున్నారు. వంద రోజుల్లో పిల్లలు పుడతారా అంటూ వింత మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్‌ను తిట్టుకుంటూ తిరిగితే చాలు, పాలన చేయనక్కర్లేదు అనే చందాన సీఎం వ్యవహార శైలి ఉందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన పనులకు రిబ్బన్లు కట్ చేయడానికి సీఎం తన జేబులో కత్తెర పెట్టుకుని తిరుగుతున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర అభివృద్ధి శూన్యమైందని, కేవలం అప్పులే పెరిగిపోయాయని కేటీఆర్ ఆరోపించారు. ఈ కొద్ది కాలంలోనే ప్రభుత్వం దాదాపు 4 లక్షల కోట్ల రూపాయల అప్పు చేసిందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో పేదలకు ఒక్క ఇల్లు కూడా కట్టి ఇవ్వలేదు గాని, 'హైడ్రా' పేరుతో ఉన్న ఇళ్లను మాత్రం నిర్దాక్షయంగా కూల్చుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులను 'దండుపాళ్యం ముఠా'తో పోల్చిన ఆయన, ఈ ప్రభుత్వాన్ని ఒక మాఫియా నడుపుతోందని, ఆ మాఫియాలో రేవంత్ రెడ్డి ఒక పిల్ల నాయకుడు అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రంలో రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రభుత్వం దగ్గర గోనెసంచులు కూడా లేవని, ఆ సంచులన్నీ ఢిల్లీకి పోతున్నాయని విమర్శించారు. రైతులకు ఇవ్వాల్సిన 'రైతుబంధు' డబ్బు బంద్ అయిపోయిందని, ఆ పైసలన్నీ రాహుల్ గాంధీ ఖాతాలో 'టింగ్ టింగ్' అని పడుతున్నాయని ఆరోపించారు. ప్రస్తుతం పరిస్థితి ఎంత దారుణంగా ఉందంటే, రైతులు ధాన్యం కుప్పలపైనే ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు మంచి, చెడు ఏంటో పూర్తిగా అర్థమైందన్న కేటీఆర్, కేసీఆర్‌ను మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి ప్రజలంతా కథానాయకులు కావాలని పిలుపునిచ్చారు.

# పాఠశాలల్లోనే దేశ భవిష్యత్

**మొదటిపేజీ తరువాయి**



అందిస్తున్నామని అన్నారు. అందుకోసం విద్యార్థులు ఆత్మగౌరవంతో పాఠశాలకు వెళ్లేందుకు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విద్యపై నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని చెప్పారు. అందుకోసం విద్యాశాఖను తానే స్వయంగా నిర్వహిస్తున్నానని చెప్పారు. నగరంలోని ఎల్బీ స్టేడియంలో యంగ్ ఇండియా ఎడ్యుకేషన్ కిట్ల పంపిణీని గవర్నర్ శివప్రతాప్ శుక్లాతో కలిసి సీఎం ప్రారంభించారు. గురుకుల పాఠశాల విద్యార్థులకు 22 వస్తువులతో కిట్లు అందించారు. వసతి గృహ విద్యార్థులకు 10, పాఠశాల విద్యార్థులకు 7 వస్తువులతో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ భాషా ప్రయుక్తరాష్ట్రంగానో, పాలనా సౌలభ్యం కోసమో ఏర్పడింది కాదని ఈసందర్భంగా అన్నారు. 60 ఏళ్ల సుదీర్ఘ పోరాటం, విద్యార్థుల ఆత్మబలిదానాలతో ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు, ఉపాధి కోసం ఎంతోమంది త్యాగాలు చేశారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో ఉంది.. వాటిని పునరుద్ధరించాలన్నదే తన సంకల్పమని అన్నారు. విద్యాశాఖను గతంలో విధ్వంసం చేశారు. గత పాలకుల అరాచకంతో రాష్ట్రానికి వందేళ్ల నష్టం జరిగింది. తెలంగాణ ఎడ్యుకేషన్ పాలసీ రూపొందించి ప్రక్షాళన చేపట్టాం అని వివరించారు. విధ్వంసమైన విద్యాశాఖను వికాసం వైపు నడిపించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం బడ్జెట్‌లో 8.5 శాతం నిధులు కేటాయించాం. వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం రూ.26,600 కోట్లు ఖర్చు చేస్తున్నాం. వీటిని భావితరాల భవిష్యత్తును నిర్ణయించే పెట్టుబడులుగా భావిస్తున్నాం. ఆరుట్లలోని తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో నో అడ్మిషన్ బోర్డు పెట్టారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇలా బోర్డు పెట్టే పరిస్థితి వస్తుందని ఎవరూ ఊహించి ఉండరని అన్నారు. ఉద్యోగులకు జీతాల మాదిరిగానే ప్రతినెలా ఒకటో తేదీన విద్యార్థులకు కాస్మోటిక్ ఛార్జీలు చెల్లిస్తున్నామని రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో హాస్టల్ విద్యార్థులకు ఈ ఛార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక పెంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో గవర్నర్‌తో పాటు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త
RNI NO: TELTEL/2023/87607
శనివారం 20 జూన్ 2026

# బురద రోడ్లకు చెక్..

## ధర్మసాగర్‌కు రూ.42 లక్షల సీసీ రోడ్లు



**ధర్మసాగర్, /హనుమకొండ బ్యూరోజూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** వర్షాకాలం వచ్చిందంటే చాలు.. ధర్మసాగర్ గ్రామంలోని పలు వీధులు బురదమయంగా మారి ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుండటంతో ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించారు. ఉపాధి హామీ పథకం (ఈజీఎస్) కింద ధర్మసాగర్ మేజర్గ్రామపంచాయతీకి రూ. 42 లక్షల విలువైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను మంజూరు చేశారు. ఈ మేరకు శుక్రవారం సర్పంచ్ మాచర్ల జ్యోతి ఏలియా, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులకు సీసీ రోడ్ల పనుల మంజూరు ప్రొసీడింగ్ కాపీని ఎమ్మెల్యే అందజేశారు. గ్రామంలోని సమస్యాత్మక వీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల ఇబ్బందులను గుర్తించి వెంటనే స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరికి గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్ల నిర్మాణంతో వర్షాకాలంలో బురద సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజలకు రాకపోకలు సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎమ్మెల్యే చూపుతున్న చొరవ అభినందనీయమని స్థానిక నాయకులు తెలిపారు.

# గేదెల దొంగల ముఠా అరెస్ట్

## రైతులు అప్రమత్తంగా ఉండాలని పోలీసుల హెచ్చరిక

**తల్లాడ,/ జూన్ 19 (జర్నలిస్ట్ వార్త) ం**



మండలంలోని పలు గ్రామాల్లో గేదెల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని తల్లాడ ఎస్ఐ వెంకటకృష్ణ శుక్రవారం వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. తల్లాడ మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల పరిధిలో మేత కోసం వదిలిన గేదెలను లక్ష్యంగా చేసుకుని ఓ ముఠా దొంగతనాలకు పాల్పడుతోంది. రైతులు వ్యవసాయ పనులతో పొలాల్లో నిమగ్నమై ఉండే సమయాన్ని ఆసరాగా చేసుకుని గ్రామాల్లో సంచరిస్తూ పరిస్థితులను గమనించి, రాత్రి వేళల్లో టాటా ఏస్ వాహనాల్లో వచ్చి గేదెలను ఎత్తుకెళ్లేవారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు మల్లారం గ్రామానికి చెందిన కటికి శ్రీకాంత్, చౌడ పవన్, దడిపల్లి కాళేశ్వరరావులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వ్యసనాలకు బానిసలైన వీరు మేత కోసం వదిలిన గేదెలను దొంగిలించి ఇతర ప్రాంతాల్లో విక్రయించినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ వెల్లడించారు. కేసుకు సంబంధించి తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు. ఈ సందర్భంగా రైతులకు ఎస్ఐ వెంకటకృష్ణ పలు సూచనలు చేశారు. గేదెలను నిర్లక్ష్యంగా వదిలివేయకుండా స్వయంగా లేదా కాపరుల ద్వారా పర్యవేక్షించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పశువుల దొంగతనాల నివారణకు గ్రామస్తులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ం

# కృత్రిమ మేధలో యువతకు తొలి అడుగు

## ముగిసిన 'అన్నా-అక్క' శిక్షణ కార్యక్రమం



**నేలకొండపల్లి, /జూన్ 19( జర్నలిస్ట్ వార్త)** భవిష్యత్ ప్రపంచాన్ని ప్రభావితం చేయనున్న కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ సాంకేతికతలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నిర్వహించిన రెండు రోజుల 'అన్నా-అక్క' శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో విజయవంతంగా ముగిసింది. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఈ శిక్షణలో అధ్యాపకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంపొందించుకున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆలేటి పరంజ్యోతి మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకుని భవిష్యత్ అవకాశాలకు సిద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జేఎన్‌టీయూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ కె. మందాకిని మాస్టర్ ట్రైనర్‌గా పాల్గొని కృత్రిమ మేధ, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై సమగ్ర శిక్షణ అందించారు. శిక్షణలో భాగంగా ఏఐ, డీప్ లెర్నింగ్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌ల మధ్య ఉన్న తేడాలు, వాటి వినియోగాలు, వాస్తవ జీవిత సమస్యల పరిష్కారంలో కృత్రిమ మేధ పాత్రను వివరించారు. అలాగే సీ, సీ జావా ప్రోగ్రామింగ్ భాషల ప్రాథమిక అంశాలు, కోడింగ్ ప్రాముఖ్యత, డిజిటల్ ప్రపంచంలో అవకాశాలు, సవాళ్లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి సారించారు. పబ్లిక్ వై-ఫై వినియోగంలో జాగ్రత్తలు, వ్యక్తిగత గోప్యత పరిరక్షణ, డిజిటల్ ఫుట్‌ప్రింట్ ప్రభావం, బలమైన పాస్‌వర్డ్ అవసరం, నకిలీ వెబ్‌సైట్లు, స్కామ్ లింకులను గుర్తించే విధానాలను వివరించారు. సురక్షిత ఆన్‌లైన్ గేమింగ్, విద్యార్థుల హక్కులు, బాధ్యతలు, నైతిక విలువలపై కూడా మార్గనిర్దేశం చేశారు. ఈ శిక్షణ పొందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు జూలై నెలలో పరిసర ప్రాంతాల ప్రభుత్వ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏఐ, డిజిటల్ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరువ చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఏఐ ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ నోడల్ అధికారులు డాక్టర్ ఎన్. శ్రీనివాసరావు, డాక్టర్ జ్యోతిర్మయి రాణి, డాక్టర్ ఎస్. రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి. వెంకటేశ్వర రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సెర్ప్ ఉద్యోగి మోహన్ బాబు కుటుంబానికి తోటి సిబ్బంది కొండంత అండ



**సంగెం/జూన్ 19(జర్నలిస్ట్ వార్త):** అనారోగ్యంతో అకాల మృతి చెందిన నెక్కొండ సెర్ప్ సంఘ నియోజకవర్గ సమన్వయకర్త మేదరి మోహన్ బాబు కుటుంబానికి తోటి ఉద్యోగులు కొండంత అండగా నిలిచారు. మోహన్ బాబు మృతితో ఆ కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను చూసి చలించిన తోటి సిబ్బంది, తమ స్వయం విరాళాల ద్వారా రూ. 88,200 నగదును సేకరించారు. ఈ మొత్తాన్ని శుక్రవారం సెర్ప్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధుల బృందం, వరంగల్ స్త్రీనిధి ప్రాంతీయ మేనేజర్ సైదిరెడ్డి, రవీందర్ రాజుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. దీనితో పాటు జనగామ జిల్లా జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కందిక అనిల్ అమెరికా నుండి విరాళంగా అందజేసిన 25 కేజీల బియ్యాన్ని కూడా వారికి అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. అనంతరం నెక్కొండ మండల సమైక్య సమావేశంలో సహాయ ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్, అధ్యక్షురాలు రజితల ఆధ్వర్యంలో గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, సిబ్బంది మోహన్ బాబు మృతికి సంతాపం ప్రకటిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘ ప్రతినిధులు రాజీర్, కిరణ్, తిలక్, గోలి కొమురయ్య, కుమార్, రాజయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా

## కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ.. విద్యార్థులకు ఉచిత పుస్తకాల అందజేత





**తల్లాడ, /జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీఱ జన్మదిన వేడుకలను తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గొడుగునూరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, రాజ్యాంగ స్ఫూర్తి కాపాడటం, సామాజిక న్యాయం సాధన కోసం ఆయన నిరంతరం పోరాటం చేస్తున్నారని అన్నారు. యువత, రైతులు, కార్మికులు, మహిళలు, వెనుకబడిన వర్గాల సమస్యలను దేశవ్యాప్తంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లి వారి గొంతుకగా నిలుస్తున్న నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ తరపున మరోసారి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యకర్తలు "జై కాంగ్రెస్.. జై జై కాంగ్రెస్", "భావి భారత ప్రధాని రాహుల్ గాంధీ" అంటూ నినాదాలతో కార్యాలయాన్ని మార్మోగించారు. అనంతరం బిల్లుపాడు గ్రామపంచాయతీ పరిధిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన ఫ్రీ ప్రైమరీ స్కూల్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి తల్లాడ మండల ఎంఈఓ దామోదర్ ప్రసాద్, ఖమ్మం జిల్లా కాంగ్రెస్ నాయకుడు జక్కంపూడి కిషోర్, గ్రామ సర్పంచ్ ఎనిక కృష్ణవేణి, హెచ్ఎం సరోజిని తదితరులు హాజరయ్యారు. ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల హెచ్ఎం జోసఫ్ పాల్గొన్నారు.

ఈ వేడుకల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రఘుపతి రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ గోవిందు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ ముకరా ప్రసాద్, కంచపోగు వెంకటేశ్వర్లు, దీవెల వెంకటేశ్వరరావు, దిరిశాల నరసింహారావు, మారెళ్ల మల్లికార్జునరావు, తుమ్మలపల్లి రమేష్, తాళ్ల జోసెఫ్, రాయల రాము, సామినేని రామప్పారావు, దుండేటి వీరారెడ్డి, షేక్ ఇమామ్ సాహెబ్, పొట్టేటి జనార్ధన్ రెడ్డి, వేమిశెట్టి నాగన్న, రావుల గోపి గౌడ్, కటికి కిరణ్, బొడ్డు వెంకటేశ్వరరావు, భూక్యా అంజయ్య, రత్తయ్య, జయరావు, నాగేశ్వరరావు, అన్నేం కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన విద్యార్థులకు నోట్‌బుక్కు, పెన్నుల పంపిణీ

## వృద్ధులకు చీరలు, స్వీట్లు అందజేత





**ఏన్కూరు, /జూన్ 19 (జర్నలిస్ట్ వార్త)**
మారుమూల గిరిజన ప్రాంతాల్లోని చిన్నారులకు విద్యా సామగ్రి అందించి విద్యాభివృద్ధికి తోడ్పడాలని తల్లాడ మండల పాస్టర్స్ టీసీసీ అధ్యక్షుడు కేవీ ఇజ్రాయిల్ అన్నారు. ఏన్కూరు మండలంలోని మేడేపల్లి గిరిజన గ్రామంలో గురువారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఏన్కూరు మండల కేంద్రానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో అటవీ ప్రాంతంలో ఉన్న మేడేపల్లి గ్రామంలో సుమారు 60 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో పదేళ్లలోపు దాదాపు 50 మంది చిన్నారులకు పెన్నులు, పలకలు, నోట్‌బుక్లు పంపిణీ చేశారు. అలాగే గ్రామంలోని 20 మంది వృద్ధ మహిళలకు చీరలు, స్వీట్లు అందజేశారు.

ఈ సందర్భంగా కేవీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ మేడేపల్లి వంటి గిరిజన గ్రామాలు ఇప్పటికీ కనీస సౌకర్యాలకు దూరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామానికి సరైన రహదారి, విద్యుత్, రవాణా, సమాచార వ్యవస్థలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అధిక శాతం కుటుంబాలు ఆర్థికంగా వెనుకబడినవేనని పేర్కొన్నారు. ఇటువంటి గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

కార్యక్రమంలో పాస్టర్ గొల్లమందల దేవాసహాయం, గ్రామ పెద్దలు, విద్యార్థులు, మహిళలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు

### జీల్గుల, పెంచికల్పేట్ గ్రామాల్లో కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆకస్మిక తనిఖీలు





**ఎల్కతుర్తి, /జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**
గ్రామాల సమగ్రాభివృద్ధికి పారిశుద్ధ్యం, పచ్చదనం, నాణ్యమైన విద్య మూడు ప్రధాన స్తంభాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అన్నారు. శుక్రవారం ఎల్కతుర్తి మండలం జీల్గుల, పెంచికల్పేట్ గ్రామాల్లో ఆకస్మికంగా పర్యటించిన ఆమె సెగ్రిగేషన్ షెడ్లు, ఉపాధి హామీ పనులు, ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు.

ముందుగా జీల్గుల గ్రామంలోని సెగ్రిగేషన్ షెడ్డును సందర్శించిన కలెక్టర్ తడి, పొడి చెత్త వేరు చేసే విధానం, కంపోస్ట్ ఎరువు తయారీ ప్రక్రియపై ఆరా తీశారు. చెత్త నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

**ఉపాధి హామీ పనులు గ్రామీణ కుటుంబాలకు భరోసా**

అనంతరం ఊర చెరువులో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించిన కలెక్టర్ కూలీల హాజరు, పనుల పురోగతి, వేతనాల చెల్లింపులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెరువుల పూడికను వ్యవసాయ భూములకు తరలించడం ద్వారా భూసారం పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. వ్యవసాయ విరామ సమయంలో ఉపాధి హామీ పథకం గ్రామీణ కుటుంబాలకు ఆర్థిక భరోసాగా నిలుస్తోందన్నారు. చెరువు కట్టల వెంట విస్తృతంగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు.

**విద్యార్థుల ప్రతిభపై కలెక్టర్ ప్రశ్నలు**

జీల్గుల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. గణితం, ఇంగ్లీష్, సాంఘిక శాస్త్రం అంశాల్లో ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు అందాయా లేదా అనే విషయాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మమేకమైన కలెక్టర్ భారతదేశ భౌగోళిక స్వరూపం, సరిహద్దుల గురించి వివరిస్తూ పాఠాలు బోధించారు. ప్రశ్నలకు సరైన సమాధానాలు చెప్పిన విద్యార్థులను అభినందించారు.

**బడిబాట విజయవంతం చేయాలి**

పాఠశాల దశలోనే విద్యార్థులకు బలమైన విద్యా పునాది ఏర్పడితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని కలెక్టర్ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థుల నమోదు పెంచేందుకు చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.

అనంతరం వనమహోత్సవం సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ మేన శీను, జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజు గౌడ్, తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో విజయ్‌కుమార్, గ్రామ సర్పంచ్ సృజన తదితరులు పాల్గొన్నారు.

# రాళ్లవాగు తండలో ఉప్పుల మైసమ్మ ఆలయానికి భూమిపూజ





**దామరచర్ల, /జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని రాళ్లవాగు తండ గ్రామంలో ఉప్పుల మైసమ్మ తల్లి (బోట్కు భవాని) ఆలయ నిర్మాణ పనులకు శుక్రవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. వేదమంత్రాల నడుమ జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని ఆలయ నిర్మాణం సాఫల్యంగా పూర్తికావాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ధీరావత్ శంకర్ నాయక్, ఉపసర్పంచ్ నాగమణి కిషన్, వార్డు సభ్యులు కోట నాయక్, మంగ కిషన్ నాయక్ హాజరయ్యారు. అలాగే శివాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధీరావత్ మోహన్ నాయక్, కొండ్రపోల్ ఉమ్మడి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ మాన్య నాయక్, మాజీ ఉపసర్పంచ్ నాగు నాయక్, ధీరావత్ వంశీ నాయక్‌తో పాటు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు సామాజిక ఐక్యతకు ఆలయాలు వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఆలయ నిర్మాణానికి గ్రామస్థులందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

# ధర్మసాగర్..




## చరిత్ర, సంస్కృతి, జలవైభవానికి చిరునామా

### కాకతీయుల వారసత్వాన్ని నేటికీ కాపాడుతున్న గ్రామం

**హనుమకొండ జిల్లాలోని ధర్మసాగర్ గ్రామం పేరు వినగానే ముందుగా గుర్తుకు వచ్చేది విశాలమైన చెరువు. శతాబ్దాల చరిత్రను తనలో దాచుకున్న ఈ గ్రామం, తెలంగాణ జలసంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. ఒకవైపు చారిత్రక ప్రాధాన్యం, మరోవైపు వ్యవసాయ సంపద, ఇంకోవైపు వేలాది మందికి తాగునీటిని అందించిన ఘనతతో ధర్మసాగర్ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది.**

వరంగల్ నగరానికి సమీపంలో ఉన్న ఈ గ్రామం నేడు మండల కేంద్రంగా అభివృద్ధి చెందినప్పటికీ, దీని చరిత్ర మాత్రం శతాబ్దాల వెనక్కి తీసుకెళ్తుంది. కాకతీయుల కాలంలో నిర్మించబడిన ధర్మసాగర్ చెరువు ఈ ప్రాంత అభివృద్ధికి మూలస్థంభంగా నిలిచింది. ప్రకృతి వనరులను సంరక్షిస్తూ, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా నిర్మించిన చెరువుల వ్యవస్థకు ధర్మసాగర్ నేటికీ సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

## ధర్మసాగర్ పేరుకు కారణమే చెరువు



గ్రామానికి చెరువు పేరు వచ్చిందా.. లేక చెరువుకు గ్రామం పేరు వచ్చిందా అనే అంశంపై భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ, ధర్మసాగర్ అంటే చెరువు, చెరువు అంటే ధర్మసాగర్ అనే స్థాయిలో ఈ రెండూ విడదీయరాని బంధాన్ని కలిగి ఉన్నాయి. గ్రామ ప్రజల జీవన విధానం, వ్యవసాయం, ఆర్థిక పరిస్థితులు అన్నీ ఈ చెరువుతో ముడిపడి ఉన్నాయి.
పూర్వం నుంచి ఈ ప్రాంత ప్రజలకు సాగునీటిని అందిస్తూ వచ్చిన చెరువు, కాలక్రమేణా వరంగల్ నగర ప్రజల దాహార్తిని తీర్చే ప్రధాన జలవనరుగా మారింది. ఒక దశలో వరంగల్, హనుమకొండ, కాజీపేట నగరాలకు తాగునీటి అవసరాలను తీర్చడంలో ధర్మసాగర్ చెరువు కీలక పాత్ర పోషించింది.



### కాకతీయుల దూరదృష్టికి నిదర్శనం

తెలంగాణలో చెరువుల సంస్కృతి గురించి మాట్లాడినప్పుడు కాకతీయుల పేరును తప్పనిసరిగా ప్రస్తావించాల్సి ఉంటుంది. వర్షాధార వ్యవసాయాన్ని స్థిరీకరించేందుకు వారు నిర్మించిన వేలాది చెరువుల్లో ధర్మసాగర్ ఒకటి. భారీ వర్షాలు కురిసినప్పుడు నీటిని నిల్వ చేసి, అవసరమైన సమయంలో రైతులకు అందించే విధంగా ఈ చెరువు నిర్మాణం జరిగింది.
అప్పటి పాలకుల దూరదృష్టి కారణంగానే నేటికీ ఈ చెరువు ప్రజలకు ఉపయోగపడుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో లేని కాలంలో ఇంతటి జలాశయాన్ని నిర్మించడం ఆ కాలం ఇంజినీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా చెప్పవచ్చు.

### రైతులకు జీవనాధారం

ధర్మసాగర్ గ్రామ ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయం. చెరువు నీటి ఆధారంగా వరి, పత్తి, మొక్కజొన్న, మిరప, కూరగాయల సాగు విస్తృతంగా జరుగుతోంది. చెరువులో సమృద్ధిగా నీరు ఉన్న సంవత్సరాల్లో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తుంది. నీటి కొరత ఏర్పడినప్పుడు మాత్రం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు.
చెరువు కారణంగానే పరిసర గ్రామాల్లో వ్యవసాయం అభివృద్ధి చెందిందని స్థానిక రైతులు చెబుతుంటారు. వేలాది ఎకరాల భూములకు ఈ చెరువు సాగునీటిని అందిస్తూ రైతులకు ఉపయోగకరంగా మారింది.

### మండల కేంద్రంగా అభివృద్ధి

రాష్ట్ర పునర్విభజన అనంతరం ధర్మసాగర్ మండల కేంద్రంగా మరింత ప్రాధాన్యం పొందింది. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, బ్యాంకులు, ఆసుపత్రులు, రవాణా సౌకర్యాలు అభివృద్ధి చెందాయి. గ్రామం నుంచి పట్టణీకరణ వైపు అడుగులు వేస్తున్నప్పటికీ, తన గ్రామీణ సంస్కృతిని ఇప్పటికీ కాపాడుకుంటోంది.
వ్యాపార రంగం కూడా క్రమంగా అభివృద్ధి చెందుతోంది. రైస్ మిల్లులు, వ్యవసాయ ఆధారిత వ్యాపారాలు, చిన్న పరిశ్రమలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు బలం చేకూరుస్తున్నాయి.

### భవిష్యత్తుపై ఆశలు

ధర్మసాగర్ చెరువు పరిరక్షణ, కాలువల అభివృద్ధి, పర్యాటక అవకాశాల వినియోగం వంటి అంశాలపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. చెరువు చుట్టూ పర్యాటక అభివృద్ధికి అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే ధర్మసాగర్ తెలంగాణలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా ఎదిగే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

### చారిత్రక ఆనవాళ్లు

ధర్మసాగర్ పరిసర ప్రాంతాల్లో లభించిన పురాతన రాతి సమాధులు, ఇతర పురావస్తు ఆనవాళ్లు ఈ ప్రాంతానికి వేల సంవత్సరాల చరిత్ర ఉందని సూచిస్తున్నాయి. చరిత్ర పరిశోధకుల దృష్టిని ఆకర్షించిన ఈ ఆనవాళ్లు, ధర్మసాగర్ ప్రాంతంలో ప్రాచీన మానవ నివాసాలు ఉన్నట్లు తెలియజేస్తున్నాయి.



### ఆధ్యాత్మికతకు నిలయం



ధర్మసాగర్ గ్రామంలో పలు పురాతన దేవాలయాలు ఉన్నాయి. గ్రామదేవతల ఆలయాలు, హనుమాన్ ఆలయం, శివాలయాలు, ఇతర దేవాలయాలు గ్రామ సంస్కృతిని ప్రతిబింబిస్తుంటాయి. ప్రతి ఏడాది జరిగే జాతరలు, ఉత్సవాలు గ్రామ ప్రజలను ఒక్కచోట చేర్చి ఐక్యతను పెంపొందిస్తాయి.
ఉప్పుల మైసమ్మ ఆలయం, గ్రామ దేవతల పండుగలు, బోనాలు, బతుకమ్మ సంబరాలు ధర్మసాగర్ సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెబుతున్నాయి.

### జిల్లాకు గర్వకారణం

చరిత్ర, సంస్కృతి, వ్యవసాయం, జలవనరులు, ఆధ్యాత్మికత.. ఇలా అన్ని రంగాల్లో ప్రత్యేకతను కలిగి ఉన్న ధర్మసాగర్ గ్రామం హనుమకొండ జిల్లాకు గర్వకారణంగా నిలుస్తోంది. శతాబ్దాల క్రితం నిర్మించిన చెరువు నేటికీ లక్షలాది మందికి ఉపయోగపడుతుండటం ఈ ప్రాంత ప్రత్యేకత. కాకతీయుల జలవైభవానికి ప్రతీకగా నిలిచిన ధర్మసాగర్, భవిష్యత్తు తరాలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలవాలని ప్రజలు కోరుకుంటున్నారు.



సీనియర్ జర్నలిస్టు
కొట్టే సుధాకర్ (లెనిన్)
టి.యు.డబ్ల్యు.జే (ఐ.జే.యూ) జిల్లా
కార్యవర్గ సభ్యులు 9908401581

# సాధారణ ప్రసవాలు పెంచేందుకు ప్రత్యేక చర్యలు

### వైద్యులు బాధ్యతాయుతంగా సేవలందించాలి

### తిరుమలాయపాలెం 100 పడకల ఏరియా ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ దివాకర టీఎస్







**తిరుమలాయపాలెం,/ జూన్ 19 ఓజర్నలిస్ట్ వార్త)**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రభుత్వ ఆసుపత్రులు కీలక పాత్ర పోషించాలని ఆయన పేర్కొన్నారు.
పాలేరు నియోజకవర్గ పర్యటనలో భాగంగా శుక్రవారం తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, లేబర్ రూమ్, ఎమర్జెన్సీ వార్డు, ఓపీ విభాగం, ల్యాబ్, ఆపరేషన్ థియేటర్, ప్రసూతి వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, సిబ్బంది హాజరు, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో నేరుగా మాట్లాడి సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.
ఔషధ నిల్వల గదిని పరిశీలించిన కలెక్టర్ అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి రోగులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వసతులను ప్రజలకు సమర్ధవంతంగా వినియోగించేలా అవగాహన కల్పించాలని చెప్పారు.

**గర్భిణులపై ప్రత్యేక దృష్టి**

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు ఆశా కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ గర్భిణీ మహిళలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నందున వాటిని ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులను ఆదేశించారు.

**రూ.26 కోట్లతో నిర్మాణంలో ఏరియా ఆసుపత్రి**

అనంతరం మండల కేంద్రంలో రూ.26 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణాల్లో వినియోగిస్తున్న కాంక్రీట్, సిమెంట్, ఇనుము నాణ్యతను తనిఖీ చేశారు. పనుల్లో ఎలాంటి రాజీ లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటించాలని, గుర్తించిన పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం వైద్య రంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రి నిర్మాణ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు సమకూర్చి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రాజశేఖర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృప ఉషశ్రీ, వైద్య శాఖ ఈఈ ఉమామహేశ్వరరావు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కొత్తపేట సర్పంచ్.

-భూక్య ప్రవీణ్ నాయక్.



**బయ్యారం/,జూన్ 19.(జర్నలిస్ట్ వార్త)**



కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినోత్సవాన్ని గాంధీ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కొత్తపేట సర్పంచ్ భూక్య ప్రవీణ్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం సలహాదారు హనుమంతు రావు,ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ సాయితో కలిసి ప్రవీణ్ నాయక్ విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆశయాలకు అనుగుణంగా మనందరం పనిచేయాలని అన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ రక్తదానం చేసి యువతకు ఆదర్శంగా నిలిచినందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రవీణ్ నాయక్ ని ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ ఆలోచనలను గ్రామస్థాయిలో అమలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

# నారాయణపురం పంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే.




**బయ్యారం/,జూన్ 19.(జర్నలిస్ట్ వార్త)**బయ్యారం మండల పర్యటనలో భాగంగా నారయణపురం గ్రామ పంచాయితిలోని రామచంద్రాపురం గ్రామంలో నిర్మాణం పూర్తి అయిన జవ్వాజి పద్మ,మిర్యాలపెంట గ్రామ పంచాయితి పరిధిలోని సాంబ తండా, చింతల తండా,మిర్యాలపెంట గ్రామాలలోని అజ్మీర సరోజ,కాయం వెంకటమ్మ,బోడ విజయ ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పూర్తి అవ్వడంతో లబ్ధిదారుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిధిగా హాజరై లబ్ధిధారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల సమూహిక గృహ ప్రవేశం చేయించారు.ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిధారులను ఎమ్మెల్యే శాలువతో ఘనంగా సత్కరించి అభినందించారు.సాంబ తండా గ్రామంలో 5లక్షల రూపాయల వ్యయంతో నిర్మాణం చెపట్టనున్న అంతర్గత సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామస్థుల నడుమ భూమి పూజ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడివో దీపిక,మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు,సొసైటి చైర్మెన్ మూల మధుకర్ రెడ్డి,హౌసింగ్ ఏఇ ప్రియాంక,బానోత్ స్వామి,రాసమల్ల నాగేశ్వరరావు,సనప సొమేష్,కోయగూడెం సర్పంచ్ బానోత్ లింగా నాయక్,బయ్యారం గ్రామ నాయకులు గణేష్ తదితరులు పాల్గోన్నారు.

# ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వ వైఫల్యమే భూపోరాటాలకు కారణం

**కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం భారీ ధర్నా**

**అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్**

**హనుమకొండ బ్యూరో, జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):** అర్హులైన పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీలో ప్రభుత్వం విఫలమవడం వల్లే రాష్ట్రవ్యాప్తంగా భూపోరాటాలు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. అర్హులైన నిరుపేద కుటుంబాలందరికీ ఇండ్ల స్థలాల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు పట్టాలు ఇవ్వడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఒకవైపు పేదలు సొంతింటి కోసం ఎదురుచూస్తుంటే, మరోవైపు కోట్ల విలువైన ప్రభుత్వ భూములు భూ మాఫియా చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని ఆరోపించారు. హనుమకొండ జిల్లాలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి వెంటనే ఇండ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని, లేకపోతే వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా బడుగు, బలహీన వర్గాలకు సొంతింటి కల నెరవేరకపోవడం దురదృష్టకరమన్నారు.




కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలతో పాటు పక్కా ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల్లో నివసిస్తున్న నిరుపేదలకు పట్టాలు మంజూరు చేసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరారు.సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, సీపీఎం జిల్లా నాయకుడు ఎం. చుక్కయ్య అధ్యక్షతన జరిగిన ఈ ధర్నాలో వామపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, గుడిసెవాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# బయ్యారంలో ఘనంగా రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు.

**-సర్పంచ్ శాంతి కిషన్ నాయక్.**

**బయ్యారం/,జూన్ 19.(జర్నలిస్ట్ వార్త)**

బయ్యారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో బయ్యారం సర్పంచ్ గుగులోత్ శాంతి కిషన్ నాయక్ పాల్గొని కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యం,సామాజిక న్యాయం,సమ్మిళిత అభివృద్ధి విలువల పట్ల రాహుల్ గాంధీకి ఉన్న అంకితభావాన్ని అభిమానిస్తామన్నారు.ఈ సందర్భంగా నాయిని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో ధైర్యం,నిబద్ధత అవసరమైన ఈ కాలంలో ఎన్నో



సవాళ్లు ఎదురైనా తాను నమ్మిన సిద్ధాంతాల కోసం ఆయన నిలబడుతున్నారని,దేశం కోసం అసాధారణ త్యాగాలు చేసిన కుటుంబ వారసత్వాన్ని రాహుల్ గాంధీ వినయంతో,అంకితభావంతో మనందరం ముందుకు తీసుకెళ్దామన్నారు.రాహుల్ గాంధీకి మంచి ఆరోగ్యం,ఆనందం,శక్తి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శు



భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు రేలా ఆగిరెడ్డి, బయ్యారం మాజీ ఎంపీపీ కిషన్ నాయక్,ములుకురి వీరారెడ్డి,కొండ్రెడ్డి సోమిరెడ్డి,నందగిరి భద్రయ్య,వార్డు సభ్యురాలు బానోత్ సునీత,ప్రమోద్ రెడ్డి,మండ రేణుక,తాటి జనార్ధన్, కంకటి నారాయణ,పులి మల్లయ్య,పందిరి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు ముల్కనూర్ డెయిరీ ఆదర్శం : డా. ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్



**భీమదేవరపల్లి/జూన్19 (జర్నలిస్ట్ వార్త):** భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ మహిళా డెయిరీని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖకు చెందిన ఆల్ ఇండియా ఆథర్స్ కమిటీ సభ్యులు, సహకార రంగ నిపుణులు డా. ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్ శుక్రవారం సందర్శించి సంస్థ కార్యకలాపాలను పరిశీలించారు. పాల సేకరణ, నాణ్యత నియంత్రణ, మహిళా సభ్యుల భాగస్వామ్యం, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఆర్థిక నిర్వహణ అంశాలపై డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డితో ఆయన సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతకు ముల్కనూర్ మహిళా డెయిరీ చేస్తున్న కృషి ఆదర్శప్రాయమని డా. శ్రీనివాస్ పేర్కొన్నారు. డెయిరీ అభివృద్ధి, విస్తరణతో పాటు మహిళా సభ్యుల సంక్షేమం కోసం ఎండీ భాస్కర్ రెడ్డి అందిస్తున్న దూరదృష్టి నాయకత్వం, అంకితభావం, నిరంతర కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అలాగే సంస్థ సిబ్బంది నిబద్ధతతో అందిస్తున్న సేవలే డెయిరీ విజయానికి బలమైన పునాదిగా నిలుస్తున్నాయని ప్రశంసించారు. సహకార స్ఫూర్తితో మహిళల ఆదాయ వృద్ధి, ఉపాధి కల్పన, గ్రామీణాభివృద్ధికి ఈ సంస్థ విశిష్ట సేవలు అందిస్తోందని ఆయన అన్నారు. భవిష్యత్తులో శిక్షణ, డాక్యుమెంటేషన్, సామర్థ్య వృద్ధి, సంస్థాగత అభివృద్ధి కార్యక్రమాల్లో తన వంతు సహకారాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ముల్కనూర్ మహిళా డెయిరీ సాధిస్తున్న పురోగతి రెండు తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని డా. ఎస్.ఎల్.ఎన్.టి. శ్రీనివాస్ పేర్కొన్నారు.

# యువతకు స్ఫూర్తి రాహుల్ గాంధీ : జక్కుల అనిల్ యాదవ్

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు**

**భీమదేవరపల్లి/జూన్19 (జర్నలిస్ట్ వార్త):** లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 56వ జన్మదిన వేడుకలను భీమదేవరపల్లి మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. దేశ ప్రజల సంక్షేమం, యువత అభ్యున్నతి కోసం ఆయన చేస్తున్న సేవలు ఆదర్శనీయమని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణతో పాటు సామాజిక న్యాయం కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్



మండల అధ్యక్షుడు జక్కుల అనిల్ యాదవ్ మాట్లాడుతూ, యువతకు రాహుల్ గాంధీ స్ఫూర్తిదాయక నాయకుడని, దేశ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు యువత మరింత చురుకుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ పోగుల



శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ మండల వైస్ ప్రెసిడెంట్లు చిత్తుకూరి అనిల్, గుడికందుల రాజు, బుర్ర ప్రశాంత్, హుస్నాబాద్ అసెంబ్లీ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి బొల్లంపల్లి కాంతారావు, అసెంబ్లీ కార్యదర్శి వల్లెపు మహేందర్, నాయకులు ఆదరి రాజేందర్, గిరబోయిన అఖిల్ యాదవ్, చిట్కూరి నితిన్, రవితేజ, నిఖిల్, ఎలబాక సురేష్, కూన ప్రశాంత్, శేఖర్, షఫీ, కైసర్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా అశోక్ బాధ్యతల స్వీకరణ



**వర్ధన్నపేట/జూన్ 19(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా జి. అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా నూతన కమిషనర్ మాట్లాడుతూ పట్టణ ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మరింత బలోపేతం చేస్తామని, తాగునీటి సరఫరా మెరుగుపరచడం, వీధి దీపాల, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అర్హులకు అందేలా సమర్థవంతంగా అమలు చేస్తామన్నారు.పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా కమిషనర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పారదర్శకమైన, జవాబుదారీతనంతో కూడిన పరిపాలన అందించేందుకు తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. అంతకుముందు కార్యాలయానికి విచ్చేసిన నూతన కమిషనర్‌కు మున్సిపల్ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘ అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మండల విద్యాశాఖ అధికారి శ్రీధర్ తో ముఖాముఖి

**ప్రశ్న: నమస్తే ఎంఈఓ శ్రీధర్ . వర్ధన్నపేట మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత మీ మొదటి ప్రాధాన్యత ఏమిటి?**

**శ్రీధర్ ఎంఈఓ:** నమస్తే అండి. నేను బాధ్యతలు తీసుకోగానే మొదటి ప్రాధాన్యత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన , విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడంపైనే పెట్టాను. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయికి దీటుగా డిజిటల్ విద్యను అందించడం, ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చూడటం మా ప్రాథమిక లక్ష్యం.

**ప్రశ్న: ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడానికి మీ మండలం తరఫున ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?**

**శ్రీధర్ ఎంఈఓ:** ప్రతి ఏటా మేము బడిబాట కార్యక్రమాన్ని చాలా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. ఉపాధ్యాయులతో కలిసి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో అందుతున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజన పథకం, ఇంగ్లీష్ మీడియం బోధన గురించి తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. దీనివల్ల ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లల సంఖ్య గణనీయంగా పెరిగింది.

**ప్రశ్న: మన మండలంలో డిజిటల్ విద్య, సాంకేతికత వినియోగం ఎలా ఉంది?**

**శ్రీధర్ ఎంఈఓ:** వర్ధన్నపేట మండలంలోని చాలా ఉన్నత పాఠశాలల్లో ఇప్పుడు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ , ప్రొజెక్టర్ల ద్వారా బోధన సాగుతోంది. ఉపాధ్యాయులకు కూడా దీనిపై ప్రత్యేక శిక్షణ ఇచ్చాం. కేవలం పుస్తకాల్లోని




చదువే కాకుండా, విజువల్స్ ద్వారా పిల్లలకు పాఠాలు త్వరగా అర్థమవుతున్నాయి.

**ప్రశ్న: మన ఊరు - మన బడి / మన బస్తి - మన బడి కార్యక్రమం కింద వర్ధన్నపేట మండలంలో జరిగిన అభివృద్ధి గురించి చెప్పండి?**

**శ్రీధర్ ఎంఈఓ:** ఈ కార్యక్రమం ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. మొదటి విడత కింద ఎంపిక చేసిన పాఠశాలల్లో పెయింటింగ్స్, రక్షిత తాగునీరు, గ్రీన్ చాక్ బోర్డులు, విద్యుద్దీకరణ , ఆధునిక మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశాం. పాఠశాలలు ఇప్పుడు చాలా ఆకర్షణీయంగా మారాయి.

**ప్రశ్న: విద్యార్థుల్లో కేవలం చదువే కాకుండా మానసిక, శారీరక ఎదుగుదల కోసం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?**

**శ్రీధర్ ఎంఈఓ:** చదువుతో పాటు ఆటలు, కళలు చాలా ముఖ్యం. అందుకోసం మండల స్థాయిలో సైన్స్ ఫెయిర్స్ (సైన్స్ ప్రదర్శనలు), ఆటల పోటీలు, వ్యాస రచన, తదితర




పోటీలను నిరంతరం నిర్వహిస్తున్నాం, యోగా, శారీరక వ్యాయామం తరగతులు క్రమం తప్పకుండా జరిగేలా చూస్తున్నాం.

**ప్రశ్న: ముగింపుగా... వర్ధన్నపేట మండల విద్యార్థులకు తల్లిదండ్రులకు మీరిచ్చే సందేశం ఏమిటి?**

**శ్రీధర్ ఎంఈఓ:** తల్లిదండ్రులందరికీ నా మనవి ఒక్కటే ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యమున్న, అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారు. మీ పిల్లలను నమ్మి ప్రభుత్వ బడుల్లో చేర్పించండి. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. వర్ధన్నపేట మండలాన్ని జిల్లాలోనే ఉత్తమ విద్యా మండలంగా తీర్చిదిద్దడమే మా అందరి సంకల్పం.

**ప్రశ్న:** ధన్యవాదాలు శ్రీధర్ , మండల విద్యాశాఖ అభివృద్ధికి మీరు చేస్తున్న కృషికి అభినందనలు.

**శ్రీధర్ ఎంఈఓ:** ధన్యవాదాలు అండి.

# విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం

## -ప్రజాప్రతినిధుల హామీ





**కల్లూరు/, జూన్ 19 (జర్నలిస్ట్ వార్త):**కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరిశీలించారు.ఈ సందర్భంగా వారు పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న విద్యా సౌకర్యాలు, మౌలిక వసతులు, తరగతి గదుల పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. అనంతరం సంబంధిత అధికారులతో చర్చించి విద్యార్థులకు మరింత మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన సదుపాయాలపై సూచనలు చేశారు.ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు బలోపేతం చేయనున్నట్లు ప్రజాప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.